



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 02-08-2024 సంపుటి : 06 సంచిక : 315 పేజీలు : 8 వెల : రూ 3-00

# రాయలసీమలో కరువు అనేది లేకుండా చేయడమే లక్ష్యం

## అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం
## రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతాం
## రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 – మన నీరు మన సంపద దానిని కాపాడుకోవడం అందరి బాధ్యతని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.గురువారం శ్రీశైలంలో పర్యటించిన ముఖ్యమంత్రి సుండిపెంట గ్రామంలో వాటర్ యూజర్స్ అసోసియేషన్స్ తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... మనకు మంచి రోజులు వచ్చాయి. ఇప్పుడే శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్లను దర్శించుకుని, శ్రీశైలం ప్రాజెక్టులో పరవళ్ళు తొక్కుతున్న కృష్ణమ్మకు జలహారతి ఇచ్చాను. గతంలో 20 సంవత్సరాల క్రితం జూలై నెలలో శ్రీశైలం నిండింది. ఇప్పుడు మరలా నిండుగా పరవళ్ళు తొక్కుతోంది. ప్రజలందరి ఆశీస్సులు, మల్లన్న స్వామి అనుగ్రహం లభించింది. రాయలసీమలో కరువు అనేది లేకుండా చేయడం మనందరి బాధ్యత.



ఇది దివంగత ఎన్టీఆర్ కల. మొదటిసారిగా కృష్ణా మిగులు జలాలు వాడుకోవచ్చు అని చెప్పిన నాయకుడు ఎన్టీఆర్. ఆయన అనేక ప్రాజెక్టులు తీసుకువచ్చారు. తెలుగు గంగ ద్వారా రాయలసీమకు నీరు ఇచ్చిన తర్వాతనే చెన్నైకి నీరు ఇస్తామని చెప్పి దాన్ని సాధ్యం చేసిన మహనీయుడు. ఎన్టీఆర్ హంద్రీనీవా, ఎస్సార్ బీసీ, గాలేరు నగరి రిజర్వాయర్లు ప్రారంభిస్తే వాటిని నేను పూర్తి చేశాను. ఐదేళ్లలో దాదాపు 69 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాము. వీటి కొరకు గత ప్రభుత్వంలో ఖర్చుపెట్టింది కేవలం 19 వేల కోట్లు మాత్రమే. మేము దాదాపు ప్రతి సంవత్సరం 13600 కోట్లు ఖర్చు పెట్టాం. హంద్రీ నీవా కొరకు ఐదేళ్లలో 5520 కోట్లు ఖర్చు చేశాం. గత ప్రభుత్వం కేవలం 515 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. అలాగే మేము గాలేరు దగ్గరికి రూ.2050 కోట్లు ఖర్చు చేస్తే, వారు రూ.448కోట్లు ఖర్చు పెట్టారు. రాయలసీమకు మిగులు జలాలు అవసరం లేదని చెప్పారు. కానీ వాటి కొరకు మా పార్టీ పోరాటం చేసాం. మొన్నటి ఎన్నికలు ఒక సునామి. కొన్నిచోట్ల 95 వేల భారీ మెజారిటీ కూడా వచ్చింది. మీకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నిండుగా ఉంది. అలాగే నాగార్జునసాగర్ పులిచింతల కూడా నిండుగా ఉన్నాయి. సముద్రంలోకి వెళ్లే నీటిని అన్ని ప్రాజెక్టులకు పంపితే కరువు అనేది ఉండదు. నీటి విలువ ఎనలేనిది. దీనిని కాపాడుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. నీరు ఉంటే సాగు పెరుగుతుంది ఆహారం ఉత్పత్తి వస్తుంది నిండుగా ఉపాధి లభిస్తుంది. మీ అందరిలో ఒక బాధ్యత ఉండాలి. నీరు మన సంపద. నీరు ఉంటే సంపద సృష్టించేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలి. పళ్ళతోటలు ఉద్యాన పంటలు బాగా పండించాలి. రాయలసీమను రతనాల సీమ చేస్తాం... ఇది సాధ్యం. రాయలసీమలో నాలుగు ఎయిర్ పోర్టులు ఉన్నాయి. హైడ్రో, విండ్ పవర్ ప్రాజెక్టులు ఉన్నాయి. రాయలసీమలో పెద్ద ఎత్తున వ్యవసాయ ఆధార పరిశ్రమలు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రావడానికి కృషి చేస్తున్నాం. ఇందుకు అవసరమైనన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేస్తాం. మనందరికీ మంచి గాలి, ఆహారం నీరు కావాలి. ప్రజలందరూ (మిగతా 2లో )

# మద్యం పాలసీలో తప్పు చేస్తే ఎటువంటి శిక్షకైనా రెడీ : మాజీ మంత్రి నారాయణస్వామి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మద్యం పాలసీ లో ఎటువంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం ఆయన తిరుపతిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మద్యం పాలసీలో తాను తప్పు చేసినట్లు రుజువు చేస్తే ఎటువంటి శిక్షకైనా సిద్ధమేనని సవాల్ చేశారు.ఏపీలో కొత్త బ్రాండ్‌లన్ని చంద్రబాబే తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చడంలో చంద్రబాబు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి నిధులు ఓర్చుకోలేక పోయారని అన్నారు.పేదవారికి న్యాయం జరిగితే సహించలేక వైసీపీ పాలనపై తప్పుడు ఆరోపణలు చేశారని, అధికారంలోకి రావడానికి అనేక అబద్ధాలు ఆడారని ఆరోపించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కులాల కార్డును ముందుకు తీసుకువచ్చి అధికారం చేపట్టారని విమర్శించారు.ఇప్పటికైనా ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే అమ్మ ఒడి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్య అందించాలని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఉపవర్గీకరణ తక్షణమే అమలు దిశగా ప్రయత్నాలు

## సుప్రీం కోర్టులో చారిత్రాత్మక తీర్పు



న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రరేఖ. ప్రతినిధి)ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చింది. వర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ తీర్పు వెలువరించింది. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని కోర్టు స్పష్టం చేసింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం వర్గీకరణ చేపట్టేందుకు లైన్ క్లియర్ చేసింది. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ సహా ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెల్లడించింది. ఎస్సీ వర్గీకరణకు తాము అనుకూలమే అని ఇప్పటికే కోర్టుకి కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ కోర్టు తీర్పు వెలువరించింది. మొత్తం ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనంలో 6:1 మెజార్టీతో ఈ తీర్పు వెల్లడైంది.జస్టిస్ బేలా త్రివేది మాత్రం ఈ తీర్పుతో విభేదించారు. ఈ అంశంపై మొత్తం ఆరు ప్రత్యేక తీర్పులను వెల్లడించింది సుప్రీంకోర్టు. కోటాలో సబ్ కోటా ఉండడం తప్పు కాదని స్పష్టం చేసింది. అంతకు ముందు 2004లో ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో వర్గీకరణ సాధ్యం కాదని వెల్లడించింది. ఇప్పుడు ఈ తీర్పుని పక్కన పెడుతూ వర్గీకరణను సమర్థించింది ధర్మాసనం. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ అంశంపై మూడు రోజుల పాటు కేసు విచారణ జరిగింది. ఈ విచారణ తరవాత కోర్టు తీర్పుని రిజర్వ్‌లో ఉంచింది. ఇప్పుడు తీర్పు వెల్లడించింది. "వ్యవస్థాపరమైన వివక్ష కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన వాళ్లు అన్ని అవకాశాలనూ అందిపుచ్చుకోలేకపోతున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం కుల వర్గీకరణను చేయొచ్చు. కోటాలో సబ్‌కోటా ఉండడం తప్పేమీ కాదు"– సుప్రీంకోర్టు

ఈ ఏడాది ఫిబ్రవరిలో విచారణ జరిగిన సమయంలో కేంద్రం కీలక విషయాలు కోర్టుకి వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను తాము సమర్థిస్తున్నామని స్పష్టం చేసింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది. అయితే...జస్టిస్ బేలా త్రివేది మాత్రం ఈ తీర్పుతో విభేదించారు. ఈ వర్గీకరణ సరికాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ అధికారం కల్పించడాన్ని వ్యతిరేకించారు. మిగతా 6గురు సభ్యులు మాత్రం ఒకే అభిప్రాయంతో తీర్పు వెలువరించారు.

బేలా త్రివేది ఎందుకు వ్యతిరేకించారుఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చింది. వర్గీకరణను సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని తేల్చి చెప్పింది. అంతే కాదు. కోటాలో సబ్‌కోటా ఉండడం తప్పేమీ కాదని స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు మొత్తం 7గురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. అయితే..ఇందులో ఆరుగురు సభ్యులు తీర్పుపై ఏకీభవించినా (మిగతా 2లో )

# నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్రిక్తత

నెల్లూరు,నెల్లూరు కార్పోరేషన్ కార్యాలయంలో గురువారం ఉద్రిక్తత నెలకింది. కార్పొరేషన్ లో భవన నిర్మాణాలకు సంబంధించి ఆర్జీలను మంత్రి మంత్రి నారాయణ స్వీకరిస్తున్నారు. ఆ సమయంలో కార్పొరేటర్లు, కార్యకర్తలతో కలిసి కార్పొరేషన్ కార్యాలయానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేరుకున్నారు. ఎమ్మెల్యే లోపలికి వెళుతుండగా చెయ్యి అడ్డుపెట్టి పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ఒక్కరే లోపలికి వెళ్లాలని, కార్పొరేటర్లు, కార్యకర్తలను తీసుకెళ్లద్దంటూ పోలీసులు అడ్డుకున్నారు. తనకోసం కష్టపడ్డ కార్యకర్తలను ఎందుకు లోపలికి రానివ్వరంటూ పోలీసులపై ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆగ్రహం వహించారు.కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులకు కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. సీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. తరువాత శ్రీధర్ రెడ్డి కలుగజేసుకుని కార్యకర్తలను బయటకు పంపించారు. దాంతో వివాదం సద్దుమణిగింది.

# సిద్దేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజ్ కోసం కేంద్రంతో చర్చిస్తా

## నంద్యాల ఎంపీ శబరి సూచనలు తీసుకుంటాం
## రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 – నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై ఐ కానిక్ ( తీగల వంతెన ) బ్రిడ్జికి బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతామని, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి సూచనలు పరిగణలోకి తీసుకొని రాయలసీమకు కృష్ణానది నీరు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.గురువారం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పూజలు చేసి శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు పూజలు చేసి జలహారతి ఇచ్చిన అనంతరం సున్నిపెంటలో సభ నిర్వహించారు.ఈ సభలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ . బైరెడ్డి శబరి ముఖ్యమంత్రినుద్దేశించి మాట్లాడుతూ సార్ కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ 167 కె జాతీయ రహదారి మంజూరు చేసి నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై ఐ కానిక్ బ్రిడ్జి ( తీగల వంతెన ) మంజూరు చేసిందని, ఈ తీగల వంతెన ( ఐ కానిక్ బ్రిడ్జి ) వల్ల రాయలసీమకు ఎలాంటి ఉపయోగం లేదని, శ్రీశైలం ప్రాజెక్టు కు ఎగువన రాయలసీమ ఉందని, కృష్ణానది నీరు రాయలసీమకు ఉపయోగపడాలంటే తీగల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మిస్తే సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో సుమారు 60 టీఎంసీ ల నీరు నిలిచి రాయలసీమ ప్రాజెక్టులకు అందుతాయని ఎంపీ శబరి వివరించారు.సిద్దేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేయడం వల్ల రాయలసీమ కరువు, వలసలకు పరిష్కారం లభిస్తుందని, ఎలాంటి భూసేకరణ అవసరం లేదని, శ్రీశైలం ప్రాజెక్టులో పూడిక నివారణకు, ప్రాజెక్టు జీవిత కాలం పెరిగేందుకు, తక్కువ ఖర్చుతోనే బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేయవచ్చని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఐదు మంది సాగునీటి ఇంజనీరింగ్ నిపుణులు ప్రభుత్వానికి నివేదికలు కూడా ఇచ్చారని,మీరు కూడా ముఖ్యమంత్రి హోదాలో గతంలో పట్టీసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేసి, పోలవరం కుడికాలువ నుంచి కృష్ణా డెల్టాకు సాగునీరు ఇచ్చి ఇక్కడ ఆదా అయ్యే నీరు శ్రీశైలం ప్రాజెక్టులో ఆపి కరువు రాయలసీమకు అందిద్దామని, దీంతో ఇటు కృష్ణా డెల్టా, అటు కరువు రాయలసీమను కాపాడుకోవచ్చని తెలిపారని, పట్టీసీమ పూర్తి చేసిన ఘనత మీకే దక్కుతుందని, ప్రస్తుతం పట్టీసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందిస్తున్నారని, ఇక్కడ ఆదా అయ్యే నీరు శ్రీశైలంలో ఉంచి రాయలసీమకు అందించాలని కోరారు.రాయలసీమ గుండా తుంగభద్ర, కృష్ణానదులకు వరద వచ్చి శ్రీశైలం దాటి తరాలిపోతున్నా రాయలసీమలో సాగు, తాగునీటికి కరువు ఏర్పడిందని, శ్రీశైలం, సున్నిపెంటలో కూడా తాగునీటి కటకటనే అన్నారు. వారానికి ఒక సారి సున్నిపెంటలో తాగునీరు అందుతుందన్నారు.ఇప్పటికే సిద్దేశ్వరం వద్ద ఐ కానిక్ బ్రిడ్జి బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేయాలని తాను ఈ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళానని, ముఖ్యమంత్రిగా మీరు కూడా కేంద్రంపై వత్తిడి తెస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఎంపీ శబరి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్రంతో మాట్లాడాలి సిద్దేశ్వరం వద్ద తీగల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం కోసం పనిచేద్దాం అని ముఖ్యమంత్రి ఎంపీ శబరికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి సి జనార్ధన్ రెడ్డి , న్యాయశాఖ, ముస్లిం మైనారిటీ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, తదితరుల ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, సున్నిపెంట గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# సంపాదకీయం

శుక్రవారం 02-08-2024

## ప్రకృతి ప్రకోపానికి బలి కాకుండా ఏమి చేయాలి...

ఈ మధ్య కాలంలో భారత్‌లో వయనాడ్ తరహా విపత్తులు తలెత్తుతూనే ఉన్నాయి. వాతావరణ మార్పులు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఈ ముప్పులు వందలాది మందిని బలి తీసుకోగా ఎంతో మందిని నిరాశ్రయులను చేశాయి. వరుస పెట్టి భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లు ముంచుకొచ్చాయి. ఈ ఏడాది జూన్ నుంచే ఈ ప్రకృతి విపత్తులు మొదలయ్యాయి. వయనాడ్‌లో ఈ స్థాయిలో కొండ చరియలు విరిగి పడడానికి కారణమేంటో సైంటిస్ట్‌లు ఓ ప్రాథమిక అంచనాకు వచ్చారు. అరేబియన్ సముద్రం విపరీతంగా వేడెక్కెడం వల్లే ఈ విపత్తు సంభవించిందని చెబుతున్నారు. భారీగా మేఘాలు కమ్ముకుని ఒక్కసారిగా కేరళలో కుండపోత వానలు కురిశాయని వివరిస్తున్నారు. తక్కువ సమయంలోనే ఎక్కువ వర్షపాతం నమోదు కావడానికి ఇదే కారణమని అంటున్నారు. అనూహ్య స్థాయిలో వర్షాలు కురవడం వల్ల కొండ చరియలు విరిగి పడ్డాయి. ఈ విపత్తులో ఇప్పటి వరకూ 200 మందికి పైగా మృతి చెందగా వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. శిథిలాల కింద చాలా మంది బాధితులు చిక్కుకున్నారు. దాదాపు రెండు వారాలుగా అక్కడ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఫలితంగా మట్టి బాగా మెత్తబడింది. వయనాడ్‌తో పాటు క్యాలికట్, మలప్పురం, కన్నూర్ ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది. ఈ అన్ని చోట్లా కొండ చరియలు విరిగి పడ్డాయి. 2019 సమయంలో కేరళ భారీ వరదలు ముంచెత్తాయి. ఆ సమయంలో మేఘాలు ఎలా అయితే కుండపోత కురిపించాయో ఇప్పుడూ వాతావరణ పరిస్థితి అలాగే ఉందని సైంటిస్ట్‌లు చెబుతున్నారు. అరేబియన్ సముద్రం మీద మేఘాలు కమ్ముకుంటున్నాయని, ఒక్కోసారి ఈ మేఘాలే కేరళ వైపు మళ్లి ఇలా బీభత్సం సృష్టిస్తాయని వివరించారు. అరేబియన్ సముద్రం తీవ్ర స్థాయిలో వేడెక్కుతోంది. అందుకే అక్కడి వాతావరణం పూర్తిగా మారిపోతోంది. మేఘాలు దట్టంగా అలుముకుంటున్నాయి. ఇవే మేఘాలు కేరళ వైపు వస్తున్నాయి. ఆ సమయంలోనే ఇలా కుండపోత వానలు కురుస్తున్నాయి. వాతావరణంలో ఈ స్థాయిలో మార్పులు అందుకే వస్తున్నాయి. అంతకు ముందు మంగళూరులో ఈ తరహా వర్షాలు కురిసేవి. భారత్‌లోని పశ్చిమతీరంలో అనూహ్యంగా వర్షపాతం నమోదవుతోంది. ఫలితంగానే కేరళలోని పశ్చిమ కనుమల్లో ఈ ముప్పు ముంచుకొచ్చింది"ఎఓఆ వెల్లడించిన వివరాల ప్రకారం 24 గంటల్లోనే 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరి కొన్ని చోట్ల 30 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డ్ అయింది. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను మాత్రం ముందుగానే గుర్తించవచ్చు. అది ఎలా అంటే.. నిటారుగా ఉండే కొండప్రాంతాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అలాగే లోయల దిగువ భాగాల విషయంలోనూ కేర్ తీసుకోక తప్పదు. ఇక నీటిలో ఎక్కువకాలం ఉండే ప్రాంతాలపైనా కన్నేసి ఉంచాలి. కార్చిచ్చు వల్ల తగలబడిన ప్రాంతాల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. వాగు ప్రవహించే మార్గంలోను, నదీ ప్రవాహ మార్గాల్లోనూ నిర్లక్ష్యం అస్సలు పనికిరాదు. ఎగువప్రాంతాల్లో ప్రకృతి విధ్వంసం వల్ల దాని రిజల్ట్.. ఈ మార్గాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే ఇలాంటి ప్రాంతాల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. మరి కొండచరియలు విరిగిపడిన సందర్భాల్లో తప్పించుకోవడం సాధ్యం కాదా అంటే.. దీనికి సమాధానం.. అప్పుడున్న పరిస్థితులను బట్టి ఉంటుందని చెప్పాలి. ఎందుకంటే ఇలాంటి ఘటనలకు ముందు కొన్ని సంకేతాలు ఉంటాయి. రాళ్లు దొర్లుతున్న శబ్దం వింటే వెంటనే అలెర్ట్ కావాలి. అలాగే చెట్లు పడిపోయిన సౌండ్ వచ్చినా జాగ్రత్తపడాల్సిందే. మీకు సమీప ప్రాంతాల్లోని జలవనరుల్లో నీటి మట్టం అకస్మాత్తుగా పెరిగినా, తగ్గినా, ఆ నీరు బురదలా మారినా.. అది ప్రమాద సంకేతమని గుర్తించాలి. వీలైనంత త్వరగా అక్కడి నుంచి బయటపడాలి. నిపుణులు చెబుతున్న ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవడం మంచిది. గతేడాది జులైలో కొండ చరియలు విరిగి పడిన ఘటనలో 27 మంది చనిపోయారు. మహారాష్ట్రలోనూఇదే స్థాయిలో వర్షాలు కురిశాయి. పలు పర్యాటక ప్రాంతాల్లో వరదలు రావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు అసోంలోనూ విపరీతమైన వర్షాలు కురవడం వల్ల నదులు ఉప్పొంగాయి. కొండచరియలు విరిగి పడ్డాయి. ఈ విపత్తుల వల్ల 79 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 150కి పైగా జంతువులూ నీళ్లలో పడి కొట్టుకుపోయాయి. గతేడాది డిసెంబర్‌లో దక్షిణాదిలో తుఫాన్ గట్టి ప్రభావం చూపించింది. తమిళనాడులో కురిసిన భారీ వర్షానికి 31 మంది బలి అయ్యారు. రోడ్లు జలమయం అయ్యాయి. రైల్వే పూర్తిగా నిలిచిపోయింది. కొద్ది రోజుల పాటు ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. గతేడాది అక్టోబర్‌లో భారీ వర్షాలు కురవడం వల్ల హిమాలయాల్లో హిమానీ నదాలు ఉప్పొంగాయి. ఫలితంగా ఈశాన్య రాష్ట్రమైన సిక్కిమ్‌లో వరదలు ముంచెత్తాయి.

## రాయలసీమలో కరువు అనేది లేకుండా చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి....)

కూడా ఒక బాధ్యత తీసుకొని నీటిని సంరక్షణ చేయాలి. యువతలో నైపుణ్యాలు నేర్పించడానికి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఒక సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా చేస్తాం. ఎస్సీలకు ఏ,బి,సి,డి కేటగిరైజేషన్ సబబని సుప్రీంకోర్టు ఆమోదించింది. సామాజిక న్యాయం అందరికీ కావాలి. జనాభా ప్రాతిపదికన ప్రతి కులం మతం, వర్గం వారికి న్యాయం చేస్తాం. ఎక్కడ పేదవారు ఉంటే అక్కడ ఈ ప్రభుత్వం ఉంటుంది. సమాజంలో బాగుపడ్డవారు గ్రామంలో పేదవారిని పైకి తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలి. ఆర్థికంగా బాగా ఉన్న 10మంది బిపిఎల్ కు చెందిన 25 మందిని వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు సంకల్పం తీసుకోవాలి. ఆ భగవంతుని ఆశీస్సులతో రూ. 33 వేల కోట్లు ఖర్చు పెట్టి పెన్షన్లు ఇస్తున్నాం. సంపదని సృష్టించి అది పేదవారికి పంచిపెట్టడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఐదు సంవత్సరాలు కరువు లేకుండా చేయాలి. డ్రిప్ ఇరిగేషన్ పెంచాలి. అన్ని రిజర్వాయర్లలో నీటిని పొదుపు చేసి వాటిని సద్వినియోగం చేసుకొని సంపద సృష్టించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. శ్రీశైలాన్ని దివ్య క్షేత్రంగా ప్రసిద్ధి చెందేలా సహకారం అందిస్తాం. ఇక్కడి స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం. సిద్దేశ్వరం వద్ద ఐకానిక్ హైవే బ్రిడ్జి తో పాటు రిజర్వాయర్ గా కూడా చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రాయలసీమ ప్రాంతానికి దాదాపు రూ. 4 వేల కోట్లు కేటాయించారు. రాయలసీమ ప్రాంతం ఎగువన ఉంది. ఈ ప్రాజెక్టు దిగువున ఉంది. ఇక్కడ ఒక బ్యారేజ్ ఉంటే నీటి సమస్య తొలుగుతుంది. సిద్దేశ్వరం వద్ద ఒక ఐకానిక్ బ్రిడ్జి మంజూరు అయింది. ఆ బ్రిడ్జి తో పాటు అక్కడ ఒక బ్యారేజ్ ఏర్పాటు చేస్తే 60 టీఎంసీల నీరు సద్వినియోగం చేసుకోగలుగుతాం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారు పరిశీలించాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... 20 సంవత్సరాలు అనంతరం జూలై మాసంలో ప్రాజెక్టు నిండడం శుభదినంగా పేర్కొన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక స్వామి అమ్మవార్ల ఆశీస్సులతో ఈ ప్రాజెక్టు నిండింది. అన్నిచోట్లకు నీరు పంపేందుకు కృషి చేస్తాం. గిట్టని వారు ఎన్ని దుష్ప్రచారాలు చేసిన అవన్నీ అధిగమించి అభివృద్ధికి కట్టుబడి ఉంటాం. 2014-19 కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నీటి వాటాలకు చాలా సమస్యలు ఉన్నా... పట్టిసీమ ఏర్పాటు చేసి రాయలసీమకు నీరు ఇచ్చి ఆదుకున్న ఘనత మన ముఖ్యమంత్రిది. ఈ ప్రాంతంలో త్రాగడానికి నీరు లేదు. 15 రోజులకు ఒకసారి నీరు వస్తోంది. త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి కి విన్నవించారు. ఇక్కడ గతంలో అభివృద్ధికి రూ. 17 కోట్లు ఇచ్చారు. 3500 కుటుంబాలకు పట్టాలు ఇచ్చాము. ఇక్కడ భూ ఆక్రమణలు ఎక్కువ అయ్యాయి. ఈ ప్రాంతంలో చదువుకున్న పిల్లలు ఉన్నారు నిరుద్యోగ సమస్య ఉంది ఇక్కడ ఒక స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, కోట్ల జయప్రకాశ్ రెడ్డి, గిత్త జయసూర్య, ఎమ్మెల్సీలు, వివిధ నాయకులు, వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపవర్గీకరణ తక్షణమే అమలు దిశగా ప్రయత్నాలు

(మొదటి పేజీ తరువాయి....)

జస్టిసస్ బేలా త్రివేది మాత్రం విభేదించారు. ప్రస్తుతమున్న షెడ్యూల్ కులాల జాబితాలో సంస్కరణలు తీసుకొస్తామన్న పేరుతో రిజర్వేషన్‌ల మౌలిక సిద్ధాంతాన్నే కదిలించడం సరికాదని ఆమె తన వాదన వినిపించారు. షెడ్యూల్ కులాల్లో మళ్లీ ప్రత్యేకంగా గ్రూప్‌లు తీసుకు రావడం సరికాదని తేల్చి చెప్పారు. రిజర్వేషన్‌లు కల్పించిందే వెనకబడ్డ వాఅ వర్గానికి చేయూత అందించడానికి అని వివరించిన జస్టిస్ బేలీ త్రివేది, మళ్లీ ఇందులో వర్గీకరణ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇందులోనూ ప్రాధాన్యతల ఆధారంగా ఎక్కువ తక్కువ అని వర్గీకరించడం సరికాదని అభిప్రాయపడ్డారు.ప్రస్తుతానికి షెడ్యూల్ కులాలకు ప్రత్యేక హోదా కల్పించేలా రిజర్వేషన్ వ్యవస్థ ఉందని, ఇందులో ఎలాంటి మార్పులు చేయాలన్నా అది రాష్ట్రపతిద్వారానే జరగాలని స్పష్టం చేశారు. రాజకీయ కారణాలను దృష్టిలో పెట్టుకుని ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించలేదని వివరించారు. అందుకే ఆ పరిమితులు విధించాల్సి వచ్చిందని తెలిపారు. కానీ...మిగతా ఆరుగురు జస్టిస్‌లు ఒకే అభిప్రాయానికి రావడం వల్ల 6:1 మెజార్టీతో వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించారు. ఇక మరో ప్రత్యేక బెంచ్‌లో జస్టిస్ పంకజ్ మిథాల్ మెజార్టీ అభిప్రాయాలకే మొగ్గు చూపించారు. అయితే..ఈ సందర్భంగా ఆయన కొన్ని సూచనలు చేశారు. కులం, సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా అందరికీ రిజర్వేషన్‌లు ఇవ్వడం కన్నా ఓ కుటుంబంలో ఓ తరానికి మాత్రమే వీటిని పరిమితం చేస్తే బాగుంటుందని చెప్పారు. ఓ తరం రిజర్వేషన్‌ల ద్వారా లబ్ధి పొందితే ఆ తరవాతి తరానికి ఈ వెసులుబాటు లేకుండా చూడాలని సూచించారు. మరో సభ్యుడు జస్టిస్ చంద్ర శర్మ మెజార్టీ అభిప్రాయాన్నే గౌరవిస్తున్నట్టు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉండడం సరైందే అని సమర్థించారు. ఫిబ్రవరిలో ఈ అంశంపై సుప్రీంకోర్టు మూడు రోజుల పాటు విచారణ జరిపింది. ఆ తరవాత తీర్పుని రిజర్వ్‌లో ఉంచింది. చివరకు సానుకూలంగా తీర్పు వెలువరించింది. 2004లో ఈవీ చిన్నయ్య వర్సెస్ ఏపీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని రివ్యూ చేయాలని సీనియర్ అడ్వకేట్‌లు కోరారు. రాష్ట్రాలకు ఎస్సీ వర్గీకరణ చేపట్టే అధికారం లేదనిఅప్పటిధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ వాదననూ పరిగణనలోకి తీసుకున్న ప్రస్తుత ధర్మాసనంపూర్తి స్థాయిలో జరిపి తుది తీర్పు వెల్లడించింది. ఈ తీర్పుని రాజకీయ పార్టీలన్నీ స్వాగతించాయి.

## ఎన్నికల రాజకీయాల్లో బీజేపీకి భంగపాటు తప్పదు : కాంగ్రెస్




హైదరాబాద్, ఆగస్టు 1 కులంపై బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తప్పుపట్టారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఇటీవల కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కులం గురించి మాట్లాడటం కలకలం రేపిన విషయం తెలిసిందే. అనురాగ్ ఠాకూర్ జనరల్ క్యాటగిరీకి చెందిన వారని, కులం గురించి మాట్లాడే విషయంలో ఆయన సంయమనంతో వ్యవహరించాలని హితవు పలికారు. కొద్దిరోజుల కిందట బీజేపీ షాపులకు యజమానుల పేర్లు వెల్లడించే నేమ్‌ప్లేట్లు ఉండాలని డిమాండ్ చేసిందని, అప్పుడు కూడా తాము ఈ ప్రతిపాదనపై అభ్యంతరం తెలిపామని సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు.భారత్‌లో పేరు కులాన్ని వెల్లడించేలా ఉంటుందని అందుకే తాము ఈ ప్రతిపాదనను వ్యతిరేకించామని చెప్పారు. ఏ ఒక్కరి కులం గురించి అడగడం తప్పని స్పష్టం చేశారు. మీరు అగ్ర కులానికి చెందిన (అనురాగ్ ఠాకూర్) వ్యక్తి కాబట్టి ఇది మీ అహంకారాన్ని సూచిస్తోందని అన్నారు. ఈ అహంకారాన్ని భారత్ సహించదని పేర్కొన్నారు. అనురాగ్ ఠాకూర్, బీజేపీ ఈ అహంకారానికి ఎన్నికల రాజకీయాల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు.కాగా తన కులం ఏంటో తెలియని వ్యక్తి కుల గణన గురించి మాట్లాడుతున్నారని రాహుల్ గాంధీని ఉద్దేశించి లోక్‌సభలో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు పెనుదుమారం రేపిన సంగతి తెలిసిందే. కులం గురించి మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని, ఒకరి కులాన్ని గురించి ప్రశ్నించే హక్కు అనురాగ్ ఠాకూర్ సహా ఏ ఒక్కరికీ లేదని, ఇది రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని విపక్ష నేతలు కాషాయ పాలకులపై విరుచుకుపడ్డారు.

## ఆయన రైల్వే మంత్రి కాదు..రీల్ మంత్రి, డిరైల్‌మెంట్ మంత్రి : కాంగ్రెస్

బీజేపీ మంత్రులు తమ వైఫల్యాలకు బాధ్యత వహించేందుకు నిరాకరిస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ ఆరోపించారు. గగోయ్ గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత రెండు నెలల్లో నాలుగు గూడ్స్ రైళ్లు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదాల్లో 14 మంది మరణించినా రైల్వే శాఖ మంత్రి ఎలాంటి నైతిక బాధ్యత వహించలేదని అన్నారు. నైతిక బాధ్యత వహించకపోగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ విపక్షాల మీద విరుచుకుపడుతున్నారని ఎద్దేవా చేశారు.గత ఏడాది బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో ఏకంగా 300 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. గత ఒకట్రెండు సంవత్సరాలుగా రైలు ప్రమాదాలు పెరుగుతున్నా రైల్వే మంత్రి మాత్రం తనకేమీ పట్టనట్టు రీల్స్ చేయడంలో మునిగిపోయారని విమర్శించారు. ఆయన రైల్వే మంత్రి కాదని రీల్ మినిస్టర్, డిరైల్‌మెంట్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు.దేశంలో వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్కరూ బాధ్యత తీసుకోకపోవడం బీజేపీ సంప్రదాయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైలు ప్రమాదాలపై మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన సంతృప్తికరంగా లేదని, జవాబుదారీతనం నుంచి ఆయన పారిపోతున్నారని అన్నారు. అందుకే విపక్ష ఇండియా కూటమి పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ పేర్కొన్నారు.




## ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం తీర్పు హర్షణీయం

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు

విభారే న్యూస్. ఆగస్టు 1. కర్నూల్ ప్రతినిధి ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లలో ఏబిసిడి వర్గీకరణ పై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ... గురువారం గౌరవ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డి వై చంద్ర చూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తిలో తీర్పు వెలువరించడం పట్ల కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ప్రకటన విడుదల చేస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదిగలు ఇతర ఉపకులాల 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలించిందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల ముందు జాతీయ కాంగ్రెస్ నాయకులు శ్రీమతి సోనియా గాంధీ శ్రీ రాహుల్ గాంధీ , అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారని ఆ మాట నిలుపుకున్నారని సీనియర్ కాంగ్రెస్ లాయర్లు వాదనలు వినిపించి విజయం సాధించారని బాబురావు గారు తెలియజేశారు. 2024 ఫిబ్రవరిలో ఎస్సీ వర్గీకరణ కేసు పై సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతున్న సమయంలో.. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ తరఫున కనీసం ఒక న్యాయవాదిని నియమించకుండా వ్యవహరించి "మాదిగల ద్రోహి" గా నిలిచిపోయారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ ని మరియు న్యాయ కోవిదులను రాష్ట్రం నుండి సుప్రీంకోర్టుకు పంపించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బలమైన వాదనలను వినిపించినందుకు రేవంత్ రెడ్డి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని అత్యున్నత న్యాయస్థానానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మని, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏబిసిడి వర్గీకరణ బాధ్యతను తీసుకుంటున్నం కి ధన్యవాదములు తెలియజేయు చున్నామని ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి మాదిగ కులాలకు న్యాయం చేసే బాధ్యత తీసుకుంటామని రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని అలాగే ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణకు కట్టుబడి పనిచేయాలని బాబురావు గారు తెలియజేశారు.



## చక్రం తిప్పుతున్న టీడీపీ

# చిక్కుల్లో మేయర్...

నెల్లూరు, ఆగస్టు1 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫోర్జరీ కేసు ఉచ్చు మేయర్ మెడకు బిగుసుకుంటుంది. ఈ కేసు నుంచి బయట పడేందుకు చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతుండటంతో వైసీపీ శ్రేణులు తెగ టెన్షన్ పడుతున్నాయి. మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యం, నగర మేయర్ వేసిన అడుగులు వెరసి ఆమెకు అన్ని దారులు మూతపడేలా చేసాయంటున్నారు ..దీంతో రాష్ట్ర వ్యాప్తంగానూ ఈ కేసు పై చర్చ సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పెద్దలు తీసుకునే నిర్ణయం పై నగర మేయర్ భవితవ్యం ఆధారపడి ఉండటం ఆసక్తి రేపుతోంది.నెల్లూరు నగర పరిధిలో మార్టిగేజ్ రిలీజ్ వ్యవహారంలో పెద్ద తంతే నడిచింది. వారి జేబులు నింపుకునేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కారు. అధికారంలో ఉన్న పార్టీల నేతలు వైసీపీ నేతలు శృతిమించి వ్యవహారం నడిపించారు. నగర కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేసి దందాలకు పాల్పడ్డారు.. ఆ విషయం బయటపడటంతో వివాదం ముదిరింది విమర్శలు పెరిగాయి. ఏకంగా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.ఓ న్యాయవాది కమిషనర్ కి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. కమిషనర్ విచారణ చేసి తన సంతకాలను ఫోర్జరీ చేసినట్టు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయం అనేక మందికి తెలిసినా స్వయంగా కమిషనర్ ఫిర్యాదు చేసే వరకు పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. నగర కమిషనర్ ఫిర్యాదుతో ఇప్పటికే ఏడుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో వారిని అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు మొదలుపెట్టారు. అందరూ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి మరీ గాయబ్ అయిపోయారు ..ఆ ఎపిసోడ్ బయటపడ్డ తర్వాత మేయర్ స్రవంతి పరిస్థితి దయనీయంగా మారింది. కార్పొరేషన్ లో ఆమె మాట చెల్లుబాటు అవ్వడం లేదు. ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ పరిణామాలతో ఆమె రాజీనామా చేస్తారా? లేకపోతే ఆ ఫోర్జరీ ఎపిసోడ్‌లో కీరోల్ పోషించినట్టు ప్రచారం జరుగుతున్న భర్త జయవర్ధన్‌ను కాపాడుకోవడానికి ఏం చేయబోతున్నారన్నది చర్చల్లో నలుగుతుంది. దీనికి సంబంధించి మేయర్‌పై చట్టపరమైన చర్యలు ఉండకపోయినా.. పరిపాలనపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు.మార్ట్ గేజ్ రిలీజ్ కోసం జరిపిన పైరవీల్లో అనేకమంది వ్యాపారుల నుంచి లక్షలాది రూపాయలను నగర మేయర్ పొట్లూరి స్రవంతి, భర్త జయవర్ధన్ వెనకేసుకున్నారన్న వాదన బలంగా వినిపిస్తుంది. మేయర్ స్రవంతి అప్పట్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అండతో పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అనుచరులుగా వ్యవహరిస్తూ వచ్చారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎన్నికలకు దాదాపు ఏడాది ముందు ప్రభుత్వంపై వ్యతిరేక స్వరం వినిపించారు. వైసీపీకి దూరం అయ్యారు.కోటంరెడ్డి ఆశీస్సులతో మేయర్ అయిన స్రవంతి ఆమె భర్తలు ఆ టైంలో చచ్చే వరకు తమ వెంట కోటంరెడ్డి వెంటేనని భారీ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అయితే ఎన్నికల టైంకి తిరిగి ప్లేట్ మార్చి వైసీపీకే ఫిక్స్ అయ్యారు. అప్పుడే వారు ఫోర్జరీల ఎపిసోడ్‌ని మరింత స్పీడ్‌గా నడిపించారంట.. అప్పుడు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌పై పోటీ చేసినప్పుడు మేయర్ కపుల్ వైసీపీ తరపున హడావుడి చేశారు.ప్రస్తుతం ఆమె కేసు మరింత జటిలం కావడానికి ఇదో కారణంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి ఆమె వైసీపీలోనే కొనసాగారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ పంచన చేరదామన్నా సాధ్యపడలేదు. గత నెలలో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించింది. చేసిన తప్పును క్షమించి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తమను ఆదరిస్తారని భావిస్తున్నామని మేయర్ స్రవంతి దంపతులు బహిరంగంగా వేడుకున్నా.. ఆయనందుకు నిరాకరించారు.ప్రస్తుతం ఈ కేసులో ఏడు మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దీంతో మేయర్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాదు అనుకుని వైసీపీలోనే కొనసాగటం వైసీపీ ఓటమి పాలయ్యాక తెలుగుదేశం పార్టీ పంచన చేరే ప్రయత్నం చేయడంతో రెండు పార్టీలకు ఆమెకు దూరమైనట్లు అయ్యింది. ఆ క్రమంలోఈ కేసు నుంచి బయట పడేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.చివరిగా రాష్ట్ర మంత్రి నారాయణను కలిసి తనను ఈ కేసు నుంచి బయటపడేలా చూడాలని విజ్ఞప్తి చేసే పనిలో ఆమె బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అందుకు కోటంరెడ్డిని కాదని నారాయణ వారికి సహకరించే పరిస్థితి లేదంటున్నారు. ఈ కేసు వ్యవహారం పక్కన పెడితే.. ఆమెను మేయర్ పదవి నుంచి తప్పించే ప్రయత్నాలు అధికార కూటమి ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. చాలా ఏళ్ల తర్వాత నెల్లూరు మేయర్ పదవి ఎస్టీకి రిజర్వ్ అయింది. దీంతో కోటంరెడ్డి అనుచరుడైన జయవర్ధన్ భార్య స్రవంతి మేయర్ గా అవకాశం దక్కించుకున్నారు.ప్రస్తుతం డిప్యూటీ మేయర్లుగా టీడీపీ నేత రూప్ కుమార్ యాదవ్, ఖలీల్ అహ్మద్ ఉన్నారు. నెల్లూరు సిటీ సెగ్మెంట్లో మంత్రి నారాయణ చేతిలో పరాజయం పాలైన ఖలీల్ అహ్మద్‌కు మేయర్ పదవి ఇచ్చే పరిస్థితి లేదు. ఇక మిగిలింది రూప్ కుమార్ యాదవ్.. అయితే ఎస్టీ రిజర్వుడు కావడంతో ఆ పదవి రూప్‌కుమార్‌కు దక్కే పరిస్థితి లేదు. దాంతో మేయర్ స్రవంతిలను సెలవు పై వెళ్లేలా చేసి ఇంచార్జ్ మేయర్‌గా రూప్‌కుమార్‌యాదవ్‌ను కొనసాగించే అవకాశం ఉంది. ఆ దిశగా మంత్రి నారాయణ పావులు కదుపుతున్నారంట. మొత్తానికి నెల్లూరు మున్సిపల్ రాజకీయం రసవత్తరంగా మారిందిప్పుడు

# 12 వేల కోట్లకు చేరిన అప్పులు

విజయవాడ, ఆగస్టు 1, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ రూ.3 వేల రూపాయలు అప్పుడు కోట్ల అప్పు చేసింది. రిజర్వు బ్యాంకులో నిర్వహించిన సెక్యూరిటీ వేలంలో బాండ్లను ప్రభుత్వం విక్రయించి రూ. 3 వేల కోట్లను సమీకరించుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మంగళవారం అప్పులు చేస్తూ వస్తోంది. తాజాగా తెచ్చిన అప్పుతో అధికారంలోకి వచ్చిన రెండు నెలలు కూడా గడవక ముందే మొత్తం అప్పుడు రూ. 12 వేల కోట్లకు చేరినట్లయింది. మొట్టమొదటి సారి జూన్ 25న రూ. 2 వేల కోట్లు, జూలై 2న రూ. 5 వేల కోట్లు, జూలై 16న మరో రూ. 2 వేల కోట్లు చంద్రబాబు ప్రభుత్వం అప్పుల రూపంలో తెచ్చింది. గతంలో 2019–24 మధ్య ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఉన్నప్పుడు జగన్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేశాడని విమర్శించేవారు.అందుకు అనుగుణంగానే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అప్పుల భారాన్ని రూ. 9.74 లక్షల కోట్లకు పెంచుకుంటూ పోయారని ఎద్దేవా చేశారు. వాటిని సరిచేయాల్సిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలు కూడా ఆలోచన చేయాల్సి ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించేందుకే శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి చేస్తున్న అప్పులపై వైసీపీ కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కేవలం రెండు నెలలు కూడా గడవకముందే రూ. 12 వేల కోట్లు అప్పులు చేయడంపై విస్మయం వ్యక్తం చేస్తోంది. మేం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చారని ఆరోపణలు చేసి, ఇప్పుడు తమరు చేస్తున్నదేమిటని ప్రశ్నిస్తున్నారు. మాకన్నా రెండింతలు ఖర్చయ్యే సంక్షేమ పథకాలు అమలు చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు, సంపద సృష్టిస్తానని చెప్పుకొచ్చాడు. ఇదే సంపద సృష్టించడం అంటే అని విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ల పంపిణీ తప్ప మరే ఇతర సంక్షేమ పథకం కూడా అమలుకు నోచుకోలేదు. వారు గొప్పగా ప్రచారం చేసుకున్న సూపర్ 6 లోని తల్లికి వందనం, మహిళలకు నెలకు రూ. 1500, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, రైతులకు ఏడాదికి రూ. 20 వేలు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు వంటి ఏ పథకం కూడా అమలుకు నోచుకోలేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడం పైనా వైసీపీ అనుమానాలు వ్యక్తం చేసింది. వారు చేస్తున్న రుణాలను కనపడకుండా చేయడానికి జరుగుతున్న ప్రయత్నమేనని విమర్శిస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ ఏడాది పాటు పథకాల అమలుపై కింది స్థాయి వరకు కూలంకషంగా చర్చించి, అందరికీ న్యాయం చేసే విధంగా పథకాలను ఏడాది తర్వాత అమలు చేస్తామని చెప్పారు. లోకేశ్ ప్రకటనతో లబ్దిదారులు అయోమయంలో పడిపోయారు. తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ. 15వేల చొప్పున ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు హామీ ఇచ్చింది. ఇప్పుడు వారంతా లోకేశ్ ప్రకటనతో ఉసూరుమంటున్నారు. 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న హామీపై మరో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుతానికి అమలు చేయడం లేదని అసెంబ్లీలో చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకానుందని సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన శ్రేణులు ప్రచారం చేసుకున్నా, ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పష్టమైన హామీ మాత్రం రాలేదు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ మాట్లాడుతూ బ్లీచింగ్ పౌడర్ కొనడానికి కూడా ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చెబుతున్నారు. నా ఆఫీసర్ ఫర్నీచర్ కూడా సొంత డబ్బులతోనే తెచ్చుకుంటానని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సమస్యల నేపథ్యంలో పథకాలు అమలు జరగడంపైనే రకరకాల అనుమానాలు తలెత్తుతున్నాయి. మరోవైపు అమరావతి నిర్మాణం గురించి కూడా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద స్థోమత లేదని సెలవిచ్చారు. మరోవైపు కేంద్రం అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు వివిధ బ్యాంకుల ద్వారా సమీకరించి అప్పుగా ఇస్తామని బడ్జెట్ సందర్భంగా ప్రకటించింది. దానిపైనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఆశలు పెట్టుకున్నట్టు కనిపిస్తుంది.

# ఆపొజిషన్ స్టేజ్ లో షర్మిళ



విజయవాడ, ఆగస్టు 1ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి రాజకీయాల్ని ఆయన సోదరి , ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల తనకు అనుకూలంగా మార్చుకునే విషయంలో వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నది తాను మాత్రమేనని.. ఏపీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్న అభిప్రాయాన్ని కలిగించేలా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ప్రతిపక్ష పార్టీ వైసీపీ నిర్లిప్తత..జగన్ బెంగళూరులోనే ఎక్కువ మకాం పెడుతూండటంతో షర్మిల చురుగ్గా ఆలోచించి రాజకీయా వ్యూహాలను అమలు చేస్తున్నారు. జగన్ అసెంబ్లీకి వెళ్లకూడదన్న నిర్ణయాన్ని మరింత అడ్వాంటేజ్ గా మార్చుకుంటున్నారు. చురుగ్గా ప్రజల్లోకి వెళ్లి వారి తరపున తానే పోరాడుతున్నానన్న అభిప్రాయాన్ని కలిపిస్తున్నారు. ఎన్నికల్లో ఘోరమైన పరాజయం తర్వాత జగన్ ఇంకా తప్పటడుగులే వేస్తున్నారన్న అభిప్రాయంతో వైసీపీ క్యాడరే కాదు ఇతర రాజకీయ పార్టీలు కూడా ఉన్నాయి. అందులో మొదటిది అసెంబ్లీకి వెళ్లకపోవడం. అసెంబ్లీలో ఎవరు అవునన్నా.. కాదన్న ఆయన ప్రతిపక్ష నేతనే. కూటమికి వ్యతిరేకంగా తమ పార్టీ తప్ప మరో పార్టీ లేదని అందుకే తమదే ప్రతిపక్షమని ఆయన అంటున్నారు. ఆ విషయాన్ని టీడీపీ కూడా కాదనడం లేదు. కానీ ప్రధాన ప్రతిపక్ష హోదాను మాత్రం ఇవ్వలేదు. అందుకు పదిశాతం సీట్లు రావాలన్న రూల్ ఉందని టీడీపీ ప్రభుత్వం చెబుతోంది. పార్లమెంట్ లో గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రధాన ప్రతిపక్షహోదా ఈ కారణంతోనే ఇవ్వలేదు. కానీ ప్రతిపక్షంగా గుర్తింపు పొంది పోరాడుతూనే ఉంది. కానీ అలాంటి ప్రతిపక్షంగా పోరాడటానికి జగన్ సిద్ధంగా లేరు. నకు హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని.. తమ పార్టీ ఎమ్మెల్యేలు కూడా రారని ఆయన తేల్చి చెప్పారు. దాంతో అసెంబ్లీలో ప్రతిపక్షమే కనిపించలేదు. కనీసం అసెంబ్లీకి వెళ్లి ఉంటే.. మాట్లాడటానికి చాన్సివ్వకపోతే.. అదే విషయాన్ని ప్రజలకు చెప్పే అవకాశం ఉంటుంది. కానీ అసలు వెళ్లకపోతే.. అలా చెప్పడానికి కూడా అవకాశం ఉండదు. అసెంబ్లీకి వెళ్లేందుకు సిద్ధపడని జగన్మోహన్ రెడ్డి .. ప్రభుత్వంపై పోరాటాన్ని పార్టీ కోణలోనే చేస్తున్నారు కానీ.. సాధారణ ప్రజల దిశగా వెళ్లడం లేదు. వినుకొండలో జరిగిన హత్యా ఉదంతంతో ఢిల్లీలో ధర్నా చేశారు. తమ పార్టీ నేతలపై హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు గుప్పించారు. ఎంత మంది హత్యకు గురయ్యారో వారి వివరాలు ఇవ్వాలని మీడియాతో పాటు టీడీపీ ప్రభుత్వం అడిగినా స్పందించలేదు. అదే? సమయంలో.. శ్వేతపత్రాల పేరుతో తమ పై బురద చల్లుతున్నారని ఆరోపించారు. ఈ పోరాటం అంతా పార్టీ కోణంలోనే జరుగుతోంది కానీ..ప్రజా సమస్యలపై ఇంకా దృష్టి పెట్టలేదు. ఇక్కడే షర్మిల అడ్వాంటేజ్ తీసుకున్నారు. షర్మిల వర్షాకాలం కారణంగా వచ్చిన వరదలతో మునిగిన వంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి గూడెంలో షర్మిల నడుంలోతు నీళ్లు ఉన్న పొలంలోకి దిగి..అందర్నీ ఆశ్చర్యపరిచారు. రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలెవరూ రైతులను పట్టించుకోలేదు. వరద బాధితుల గురించి ఆలోచించలేదు. చిన్న ప్రకటన కూడా చేయలేదు. ఓ వైపు ప్రతిపక్ష పాత్రను నిర్వర్తించడానికి మొహమాట పడుతున్న వైసీపీని మరంతగా కార్నర్ చేస్తూ.. తానే ప్రభుత్వంపై పోరాటానికి ముందుకు వస్తున్నారు. ఇది వైసీపీకి ఇబ్బందికరంగా మారుతోంది. ప్రజల తరపున పోరాటంలో షర్మిల ముందుకెళ్తే.. వైసీపీకి మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే సరైన సమయంలో జగన్ బయటకు వస్తారని ఆ తర్వాత షర్మిలను ఎవరూ పట్టించుకోరని అనుకుంటున్నారు.మొత్తంగా షర్మిల, జగన్ మధ్య ప్రతిపక్ష నేతగా ప్రజల్లో గుర్తింపు కోసం హోరాహోరీ పోరు సాగుతోందని అనుకోవచ్చు. మరి ఎవరిది పైచేయి అవుతుందో ?

## స్త్రీలలో రక్తహీనతకు సరైన సమయంలో చికిత్స అందించాలి-డాక్టర్ అనూష

నంద్యాల,భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, భారత్ సీరమ్స్, వ్యాక్సిన్స్( బి ఎస్ వి) కంపెనీ సహకారంతో స్థానిక మధు మణి నర్సింగ్ హోమ్ సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు.నంద్యాల శాఖ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ రాణి అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో కాన్పు తర్వాత ఐరన్ లోపం వలన వచ్చే రక్తహీనత చికిత్సా విధానాలపై స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ అనూష, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ప్రాథమిక దశలో గుర్తించడం ఎలా అన్న అంశంపై డాక్టర్ గీతా వాణి మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా వైద్యులకు వివరించారు.డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రసవం తర్వాత చాలామంది స్త్రీలలో ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన వారిలో ఐరన్ లోపం వలన రక్తహీనత సంభవించడం అధికంగా ఉందని, రక్తహీనత ఉన్న స్త్రీలలో నీరసం, కళ్ళు తిరగడం, ఆయాసం, నాడి వేగం పెరగడం,చర్మం పాలిపోయి ఉండడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని, ఆ సమయంలో రక్తహీనతను సరి చేయాల్సిన అవసరం ఉంటుందని లేకుంటే గుండె ఫెయిల్యూర్ లోకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. వీరికి రక్తం ఎక్కించడం లేదా ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోస్(ఎఫ్ సి ఎం) సరైన మోతాదులో ఎక్కించడం ద్వారా సరి చేయవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదనరావు, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, నంద్యాల శాఖ కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర ఐఎంఏ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రజలు అర్థం చేసుకుని కాస్త టైం ఇవ్వండి

## ఆగస్టు 15 న అన్నక్యాంటీన్లు పునఃప్రారంభం

నెల్లూరు ఆంధ్ర రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా గాడి తప్పిన పరిపాలనను సరైన మార్గంలో పెట్టేందుకు టిడిపి ప్రభుత్వానికి ప్రజలు కాస్త టైం ఇవ్వాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కోరారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 48వ డివిజన్లో పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. ఏ సమస్య ఉన్న తనను నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. పెన్షన్ దారులను పేరుపేరునా పలకరిస్తూ ప్రభుత్వం అందజేస్తున్న 4000 రూపాయల పెన్షన్ను వృద్ధులకు, 6000 రూపాయల పెన్షన్ను దివ్యాంగులకు అందజేశారు. జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి 48వ డివిజన్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదును మంత్రి నారాయణ అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ... తనదైన శైలిలో వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలనపై ఘాటుగా విమర్శించారు. గత ప్రభుత్వ నిర్వాహకం వల్ల గాడి తప్పిన పరిపాలనను టిడిపి ప్రభుత్వం వచ్చాక సరిచేస్తున్నామని అయితే ప్రజలు ఇందుకు కాస్త టైం ఇవ్వాలని మంత్రి నారాయణ కోరారు. ఈ క్రమంలో ఇచ్చిన హామీల మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సమర్థవంతగా పరిపాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే పెన్షన్ల పెంపు అని అభివర్ణించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతినెల 1వ తేదీ తెల్లవారుజాము నుండే రాష్ట్రంలో 68 లక్షల 64 వేల మందికి పెన్షన్లు పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. వృద్ధులకు రూ.3వేల నుండి రూ.4 వేలు, దివ్యాంగులకు 3000 నుండి 6000 రూపాయలకు, అత్యధికంగా 15 వేల రూపాయల వరకు పెన్షన్ పెంచి ఇస్తున్నామని చెప్పారు. ఈ విధంగా సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు.గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీ చేయడమే కాదు అప్పులు చేసి పెట్టిందని ఘాటుగా విమర్శించారు. దీంతో ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో అప్పులే కనిపిస్తున్నాయని... ప్రభుత్వ భవనాలను సైతం తాకట్టు పెట్టిన దౌర్భాగ్యపు పాలన గత ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో ఆదాయ వనరులు పెరగాలని... పారిశ్రామికంగా అభివృద్ధి జరిగితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని భరోసా ఇచ్చారు. మున్సిపల్ శాఖలోని ప్రజల కట్టిన పన్నులు డబ్బులన్నిటినీ గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు వాడేశారని మండిపడ్డారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్ ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు మురిగిపోయాయన్నారు. 2014 నుండి 2019 వరకు చంద్రబాబు నాయుడు మంత్రులను కేంద్రం నుంచి వచ్చే నిధులు కోసం పరుగులు పెట్టించేవారని తెలియజేశారు. ఆగస్టు మొదటి తారీకు నుండి రాష్ట్రంలో కనీసం 100 అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభిస్తామని చెప్పారు. ఆగస్టు నెలాఖరుకు అంతా 203 అన్నా క్యాంటీన్లను పూర్తిస్థాయిలో పునఃప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు అర్థం చేసుకొని కూటమి ప్రభుత్వానికి కాస్త టైమ్ ఇవ్వాలని మంత్రి నారాయణ కోరారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా గాడి తప్పిన పరిపాలనను గాడిలో పెట్టి సమర్థవంతమైన ప్రజా ప్రభుత్వాన్ని నడుపుతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటని నిలబెట్టుకునే ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నారాయణ ప్రశంసించారు.

# మంత్రి నారా లోకేష్ ఓ ఎస్ డి గా బద్వేలు ఆర్డిఓ ఆకుల వెంకటరమణ

బద్వేలు ,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఓ ఎస్ డి గా బద్వేలు ఆర్డిఓ ఆకుల వెంకటరమణ ను నియమించారు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు బద్వేల్ లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటినప్పుడు మొట్టమొదటి ఆర్డీవో గా ఆకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు ఆయన గత నెల రోజులుగా సెలవులో ఉన్నారు అప్పటినుంచి బద్వేలు ఇంచార్జ్ ఆర్టీవో గా చంద్రమోహన్ పనిచేస్తున్నారు

# పండితుల పదోన్నతి తేదీ కామన్ గా ఉండాలి- యూటీఎఫ్

బద్వేలుఉన్నతీకరణలో భాగంగా భాషోపాధ్యాయులైన తెలుగు,హిందీ, ఉర్దూ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పాఠశాల సహాయకులుగా పదోన్నతి పొంది భిన్న రకాలైన తేదీలలో జాయిన్ అయినట్లుగా నమోదు చేసుకున్నారని దీనిని సవరించి అందరికీ ఒకే తేదీ కామన్ గా ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు.కడప జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పరిపాలనాధికారి మునీర్ ఖాన్ ను కలిసి అందుకు సంబంధించిన వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ 2019 నవంబర్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు భాషోపాధ్యాయులకు ఉన్నతీకరణ పదోన్నతులు కల్పించడమైనదని అయితే పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు నవంబర్ ఒకటవ తేదీ నుండి నాలుగో తేదీ వరకు వివిధ తేదీలలో చేరడం వలన బదిలీల సమయంలోనూ, పదోన్నతుల్లోను కొంతమేర స్పష్టత కొరవడి సీనియార్టీ విషయంలో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.జిల్లా విద్యాశాఖాధికారి ఈ విషయాన్ని పరిశీలించి పదోన్నతి పొందిన పాఠశాల సహాయకులు తెలుగు,హిందీ,ఉర్దూ మరియు వ్యాయామ ఉపాధ్యాయులకు అందరికీ 2019 నవంబర్ ఒకటో తేదీని కామన్ సీనియార్టిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై రవికుమార్ జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్ నాయకులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, యడాల సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

కౌతాళం మండల కేద్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో కౌతాళం ఎంపీడీవో రఘునాథ్ గుప్తా మరియు సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప , టీడీపీ కౌతాళం టౌన్ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ దారులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రెండో నెల కూడా ఉదయం ఆరు గంటల నుండి ఇంటి దగ్గరికే పింఛన్ పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. సంక్షేమం అభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు,భీమయ్య,శివ తదితరులు పాల్గొన్నారు.

## హోమియోపతి పీజీ పరీక్షల్లో సత్తా చాటిన ఎమ్మిగనూరు సర్ల కావ్య శ్రీ... - అభినందించిన తల్లిదండ్రులు, స్థానికులు...



ఎమ్మిగనూరు ఆగస్టు 1 విభారె న్యూస్..ఇటీవల జరిగిన ఆల్ ఇండియా పీజీ ఆయుష్ హోమియోపతి పీజీ పరీక్షల్లో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన సర్ల కావ్యశ్రీ సత్తా చాటడంతో తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలు హర్షించారు. గురువారం పట్టణంలోని హెచ్.బి.ఎస్ కాలనీలో గల విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హోమియపతి పీజీ పరీక్షల్లో సత్తా చాటి ఆల్ ఇండియా స్థాయిలో 119 ర్యాంకును సాధించి ఏపీ స్టేట్ లో టాపర్ గా నిలవడంతో కావ్యశ్రీ ని తల్లితండ్రులు మోహన్, ఉషాపరిమళ తో పాటు కుటుంబ సభ్యులు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కావ్యశ్రీ టెన్త్ ఇంటర్లో టాపర్ గా నిలవడమే కాకుండా నీట్ ఢియు జిరి ద్వార బయర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ విభాగంలో శంషాబాద్ జిమ్స్ యూనివర్సిటీలో టాపర్ గా నిలిచిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ ఎదగాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సూర్యబాబు, రాధ, తదితరులు పాల్గొన్నారు.

## తగ్గింపు ధరలకే బియ్యం కందిపప్పు ప్రత్యేక కౌంటర్ల కు పెరుగుతున్న ఆదరణ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 – ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ అదేశాలమేరకు పౌర సరఫరాల శాఖ ద్వారా తగ్గింపు ధరలకు నాణ్యమైన కందిపప్పు రూ.150/- కు బియ్యం 48/- ( స్ట్రీమ్ చేయబడింది)బియ్యం .47/- (సోనా మసూరి) రైతు బజారు (శ్రీనివాస నగర్)టెక్కె మార్కెట్యార్డ్నందుస్పెషల్కౌంటర్లు నందు విక్రయిస్తున్నామని .ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్ఓ వెంకట రాముడు సూచించారు .ఈ కార్యక్రమంలో సీహెచ్ డీటి ప్రసాద రావు. రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## 97-16. శాతం పింఛన్ల పంపిణీ

### అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 - –నంద్యాల పట్టణంలో 44 వార్డు సచివాలయాల పరిధిలో గురువారం ఒక్క రోజే 97–16 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయిందని అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పలు వార్డుల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు . ఆయన మాట్లాడుతూ పట్టణంలో 18763. మంది లబ్దిదారులు ఉన్నారని వారికి 8 కోట్ల 2 లక్షల 89 వేలు ప్రతి నెలా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గురువారం ఒక్క రోజే 18229 మంది కి పింఛన్లు అందజేశామని అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి తెలిపారు. 534 మంది మాత్రమే మిగిలారని అన్నారు . వారిలో కొందరు అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండవచ్చని కొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉండవచ్చు అని అన్నారు. వారికి శుక్రవారం పంపిణీ చేస్తామని తెలిపారు

# జిల్లాలోని 2,43,337 పింఛనుదార్లకు రూ.103.54 కోట్ల రూపాయల పంపిణీ

**ప్రతి గంటకు పెన్షన్ పంపిణీ వివరాలను తెలియచేయండి**
**తొలిరోజే వంద శాతం పెన్షన్ లను పంపిణీ చేయాలి**
**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**
**లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి సామాజిక భద్రత పెన్షన్లను అందజేసిన జిల్లా కలెక్టర్**



విభారే న్యూస్.. కర్నూలు ప్రతినిధి కర్నూలు, ఆగస్టు 01:-ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో అర్హులైన 2 లక్షల 43 వేల 337 వివిధ రకాల పెన్షన్ లబ్దిదారులకు రూ.103.54 కోట్ల రూపాయిలు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం ఉదయం 6 గంటలకే కలెక్టర్ కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చేరుకుని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అర్హులైన మస్తాన్ బీ, లక్ష్మీదేవి, వరలక్ష్మి లకు వితంతు పెన్షన్, రామాంజనేయులుకు వృద్ధాప్య పెన్షన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉదయం 6 గంటలకే పెన్షన్ పంపిణీ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.. తొలిరోజే 100 శాతం పెన్షన్ పంపిణీ చేయాలని, ఒకటీ, అరా మిగిలిపోతే రెండో రోజు కల్లా పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని డిఆర్డిఎ పిడి ని కలెక్టర్ ఆదేశించారు.. అదే విధంగా పెన్షన్ పంపిణీ పురోగతికి సంబంధించిన నివేదికలను గంట గంటకు పంపాలని డిఆర్డిఎ పిడి ని కలెక్టర్ ఆదేశించారు... చిన్నటేకూరు గ్రామంలో పెన్షన్ పంపిణీ తీరు గురించి సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.. పెన్షన్ పంపిణీ చేసే సమయంలో సర్వర్ సమస్యలు ఏమైనా వస్తున్నాయా అని పెన్షన్ పంపిణీ అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.. వచ్చే నెల నుండి పెన్షన్ పంపిణీ చేసే ఒక్క రోజు ముందుగానే 4 వేల రూపాయలను బండిల్ గా చేసుకుని సిద్ధంగా ఉంచుకుంటే పంపిణీ లో ఆలస్యం ఉండదని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ సచివాల యాన్ని పరిశీలించారు. సచివా లయ సిబ్బంది సేవలు అంది స్తున్న తీరును ఎంపిడిఓ ను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, నిర్వహణ పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.. చెత్త సంపద తయారీ కేంద్రంలో పని చేసే సిబ్బంది జీతాలు సమయానికి రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో శేషి రెడ్డి, డిఆర్డిఎ పిడి సలీం బాషా, కల్లూరు ఇన్చార్జి ఎంపిడిఓ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివరామ్, తదితరులు పాల్గొన్నారు..

## దిక్కులేనివారికి దేవుడయ్యాడు పెన్షన్ కార్యక్రమంలో ఆనందం వ్యక్తం చేసిన పెన్షన్ దారులు





విభారే న్యూస్. ఆగస్టు 1.. కర్నూల్ ప్రతినిధి.నా పేరు వరలక్ష్మి, కల్లూరు మండలం, చిన్నటేకూరు గ్రామం, కృష్ణ నగర్ నివాసిని నా భర్త కొన్ని సంవత్సరాల కిందట మరణించడం జరిగిందని అప్పటినుండి ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగించే దానినని కొంత కాలం నుండి ఆరోగ్యం బాగాలేక ఇంటి వద్దనే ఉంటూ పనులకు వెళ్లడం లేదని, గతంలో ఇచ్చే పెన్షన్ వైద్యం చేయించుకోవాలన్నా, మెడిసిన్ కొనాలన్న సరిపోయేది కాదని అటువంటి తరుణంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెయ్యి రూపాయల పెన్షన్ పెంచి నేరుగా ఇంటి వద్దకే స్వయంగా కలెక్టర్ గారే వచ్చి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి పరిస్థితులలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు దిక్కులేనివారికి దేవుడయ్యాడు అన్నారు.ఆర్థిక సమస్యలు తీరుతాయినా పేరు రామాంజనేయులు, కల్లూరు మండలం, చిన్నటేకూరు గ్రామం, కృష్ణ నగర్ నివాసిని నాకు ఒక్క కొడుకు ఉన్నాడని అతడు వృత్తిరీత్యా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, కానీ అతనికి వచ్చిన సంపాదనతో కుటుంబ పోషణ, మందులు, నిత్యవసర సరుకులకు డబ్బులు సరిపడక ఆర్థికంగా చాలా ఇబ్బంది పడేవాళ్ళమని, ఇటువంటి సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు 4 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వడంతో ఆర్థికంగా కొన్ని సమస్యలు తీరుతాయన్నారు.జీవితానికి ఎంతో భరోసానా పేరు మస్తాన్ బి కల్లూరు మండలం, చిన్నటేకూరు గ్రామం, కృష్ణ నగర్ నివాసిని పెంచిన 4 వేల రూపాయల పెన్షన్ మాలాంటి నిరుపేదలకు బతుకుమీద ఆశను కలిగించడమే కాక జీవితానికి ఎంతో భరోసాగా ఉంటుందన్నారు. ఈ వయసులో ఎలా బతకాలో అర్థం కాని సమయంలో వితంతువులకు భరోసాగా నేనున్నానంటూ పెన్షన్ పెంచి ఇవ్వడం నిజంగా అదృష్టమని ఆ డబ్బుతో ఒకరి మీద ఆధారపడకుండా సంతోషంగా జీవనం సాగించవచ్చునన్నారు.

## సీఎం చంద్రన్న ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ శ్రీ ఎన్. రాఘవేంద్ర రెడ్డి

కోసిగి టౌన్ 6వ వార్డు లోని కూటమి ప్రభుత్వంలో రెండవ నెల పెన్షన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొని అధికారుతో మరియు మండల నాయకులు తో కలిసి ఇంటింటికి వెళ్లి పెన్షన్ లబ్దిదారులకు పెన్షన్ పంపిణి చేయడం జరిగింది. అనంతరం మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండవ నెల కూడా విజయవంతంగా ఈ కార్యక్రమం చేపట్టిందని అలాగే 100% పెన్షన్ పంపిణి ఈరోజె లబ్దిదారులకు అందెవిధంగా చూడలని సాంకేతిక లోపాలు తలెత్తితే తప్ప రేపటికి వాయిదా వేయవద్దని అధికారులు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముత్తు రెడ్డి గారు, పల్లెపాడు రామిరెడ్డి గారు, జ్ఞానేష్ గారు, నర్సిరెడ్డి గారు, తోవి రామకృష్ణ గారు,కోసిగి అయ్యన్న అరివిలి వీరేష్ గారు,బిజెపి రాముడు,గాలం వీరేష్, గజ్జె ఈరన్న, బెండే వీరేష్,కోసిగియ్య,పోతుల వీరారెడ్డి,సొట్టయ్య,ముకన్నా మధు,కరీం, నూర్ బాషా, గౌస్, కలందర్, అమీర్, మరియు టౌన్ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సాంకేతికతను వినియోగించి కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు...





కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 01 విభారె న్యూస్..సాంకేతికతను వినియోగించి కిడ్నాప్ కేసును 10 గంటల్లో చేధించిన గూడూరు పోలీసులు.అభినందించిన జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్. కిడ్నాపర్ల నుంచి బంగారు వ్యాపారి వెంకటేశ్వర్లును గూడురు పోలీసులు రక్షించారు.సోమవారం సాయంత్రం గూడూరు పోలీసు స్టేషన్ లో కిడ్నాప్ కేసు నమోదు కావడం జరిగింది. మంగళవారం ఉదయమే చేధించారు.జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ ఆదేశాల మేరకు 4 పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ సిఐ నాగరాజ్ యాదవ్, గోనెగండ్ల సిఐ రామకృష్ణ,ఎమ్మిగనూరు టౌన్ సిఐ మధుసూధన్ రావు,కర్నూలు నాల్గవ పట్టణ సిఐ శంకరయ్య , సైబర్ సెల్ సిఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో గూడూరు, కోడుమూరు,కె. నాగలాపురం ఎస్సైలతో పాటు పోలీసు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు.సీసీ టీవీ పుటేజి, చరవాణి నంబర్ లోకేషన్ వంటి సాంకేతికను వినియోగించి కేసును ఛేదించారు. మంగళవారం ప్యాలకుర్తి సమీపంలో కిడ్నాపర్ల నుండి బంగారం వ్యాపారి వెంకటేశ్వర్లను రక్షించి, కుటంబ సభ్యులకు అప్పగిం చారు.కిడ్నాప్ కు గురైన బంగారం వ్యాపారి వెంకటేశ్వర్లు, గూడురు మండలం కు చెందిన బంగారం వ్యాపారస్తులు,గూడూరు ప్రజలు గురువారం జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఐపియస్ ని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి త్వరితగతిన చర్యలు తీసుకుని , కేసు ను చేధించి ,ప్రాణాలు కాపాడినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.డబ్బుల కోసమే కిడ్నాప్ చేశారనే విషయం పై దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.కిడ్నాప్ కేసును చేధించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ గురువారం అభినందించారు. ఈ సంఘటనతో గూడురు మండలం కు చెందిన బంగారం వ్యాపారస్తులు, గూడూరు ప్రజలు శభాష్ పోలీసు అంటూ పోలీసుల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు

## ప్రజా పంపిణీ వ్యవస్థ పై సర్వే



–విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 – ప్రజా పంపిణీ వ్యవస్థపై కార్డుదారుల అభిప్రాయం తెలుసుకునేందుకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా నంద్యాల మండలం పోలూరు గ్రామంలో గురువారం డీఎస్ఓ. వెంకట రాముడు . సీఎస్ డీటి ప్రసాద రావు. వీఆర్వో భాస్కర్ గౌడ్. పర్యటించారు. డీలర్ల ద్వారా జరిగే పంపిణీ, ప్రస్తుతం జరుగుతున్న ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ పై కార్డుదారుల అభిప్రాయా లను తెలుసుకున్నారు. ఈ సర్వేలో ఎక్కువ మంది బియ్యం తో పాటు చక్కెర. కందిపప్పు. గోధుమపిండి. ఎం డీయూ వాహనం ద్వారానే పంపిణీ చేయాలని తెలిపారని డీఎస్ఓ వెంకట రాముడు అన్నారు.

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో రాష్ట్రంలో అగ్ర స్థానంలో నిలిచిన కర్నూలు జిల్లా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

విభారే న్యూస్. ఆగస్టు 1. కర్నూల్ ప్రతినిధి కర్నూలు, ఆగస్టు 01:- ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ ల పంపిణీలో కర్నూలు జిల్లా 97.96 శాతంతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.. కర్నూలు జిల్లాలో మొత్తం 2 లక్షల 43 వేల 337 పెన్షన్ లు ఉండగా అందులో 2 లక్షల 38 వేల 372 పెన్షన్ లను ఈ రోజు పంపిణీ చేయడం జరిగిందన్నారు.... పెండింగ్ లో ఉన్న 4965 పెన్షన్ లను కూడా రేపటి లోపు పంపిణీ పూర్తి చేసి 100 శాతం పురోగతిని సాధించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు..

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190